
క్లుప్తంగా

మరిడమ్మకు ప్రత్యేక పూజలు


బంగారు, వెండి పుష్పాల నడుమ అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ తల్లికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహన రావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ రామ్మోహనరావు మాట్లాడుతూ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా 15వ తేదీన పందిరి రాట మూహూర్తం చేయనున్నట్టు తెలిపారు.

ఇంధన వనరులు పొదుపుగా వాడాలి

సామర్లకోట: పర్యావరణ సమతుల్యత దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఇంధన వనరులను పొదుపుగా వినియోగించే అలవాటు చేసుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామ కృష్ణ అన్నారు. స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ స్కూల్‌లో శుక్రవారం సాయంత్రం ఎకో క్లబ్ వారోత్సవాలల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వాడకం అవసరం లేని సమయంలో స్విచ్ ఆఫ్ చేయాలని సూచించారు. విద్యార్థి దశ నుంచి పర్యావరణ స్పృహ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సైన్సు టీచర్లు ఏఎల్‌వీ కుమారి, కె శ్రీనివాసు, సీహెచ్ భద్ర, కె.శేషారత్నం, జి.బాలశైలజ తదితరులు పాల్గొన్నారు.

కాపు కల్యాణ మండపం పనులు ప్రారంభం

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న కాపు కల్యాణ మండపాన్ని శుభ్రం చేసే పనులను శుక్రవారం ప్రారంభించారు. మందు బాబులకు నిలయంగా కల్యాణ మండపం మారడంతో వెంటనే గేటు ఏర్పాటు చేసి, ఇతరులు లోనికి ప్రవేశించడం నేరం అని ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని వారు సూచించారు. కల్యాణ మండపం వద్ద జరుగుతున్న పనులకు కమిషనర్ జె.రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టరు పి.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పరిశీలించారు.

రాళ్ల గోడను ఢీకొని బోటు ధ్వంసం


రాళ్ల గోడను ఢీకొట్టిన బోటు

కొత్తపల్లి: వేటకు వెళ్లిన మత్స్యకారుల బోటు తిరిగి వస్తుండగా రాళ్ల గోడను ఢీకొట్టడంతో శుక్రవాకం ధ్వంసమైంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మూలపేటకు చెందిన కోడా మసేను బోటుపై శుక్రవారం తెల్లవారుజామున మత్స్యకారులు చేపలవేటకు వెళ్లారు. వేట ముగించుకుని తిరిగి వస్తుండగా కెరటాల ఉధృతి కారణంగా బోటు రాళ్ల గోడను ఢీకొట్టింది. దీంతో బోటు అడుగు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు బాధితులు తెలిపారు.

రక్తదానంలో యువత ముందుండాలి

పెద్దాపురం: రక్తదానం చేయడంలో యువత ముందుండాలని జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవంలో భాగంగా శుక్రవారం స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కలారి శ్రీను, తమనార లక్ష్మణ్ దివాకర్, కొప్పిరెడ్డి నాగబాబు, సత్య, సాయి, స్వామి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్ పరిశీలన

సామర్లకోట: ప్రజలకు తాగునీరు అందించే ఫిల్టర్ బెడ్ ప్లాంటును మున్సిపల్ కమిషనర్ జె.రామారావు శుక్రవారం పరిశీలించారు. ఫిల్టరు చెరువులో నీరు శుద్ధి చేసినా ఫలితం కనిపించడం లేదని మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ యార్లగడ్డ చిన్ని, కౌన్సిలర్ బలుసు వాసులు అన్నారు. దాంతో గోదావరి జలాలు నేరుగా ఫిల్టరు ప్లాంటులోనికి తరలించే ఏర్పాటు చేస్తామని కమిషనర్ తెలిపారు.

శిశు గృహ సేవలు అభినందనీయం

బోట్‌క్లబ్: తల్లిదండ్రుల ప్రేమకు నోచుకోక అభాగ్యులైన పిల్లలకు ఆశ్రయం కల్పిస్తున్న శిశుగృహ సేవలు చాలా గొప్పవని హరీష్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్ అన్నారు. స్థానిక విద్యుత్‌నగర్‌లోని శిశుగృహకు శుక్రవారం రూ. 20 వేల విలువైన క్రెడిల్‌ను బహూకరించారు. అధికారులు సూచించిన మేరకు తమ సంస్థ, సానా సతీష్ బాబు ఫౌండేషన్ సహకారంతో దానిని సమకూర్చినట్టు తెలిపారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి వెంకట్రావు దాతలకు కృతజ్ఞతలు 0తెలిపారు.

ఖజానాపై బకాయిల భారం


స్టేషన్ సెంటర్‌లో ఉన్న మున్సిపల్ షాపులు

- ఏడు సెంటర్లలో 81 దుకాణాలు
- వసూలు చేయాల్సినది రూ.31 లక్షలు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో దుకాణాల పన్ను బకాయిలు ప్రభుత్వ ఖజానాకు గుదిబండగా మారాయి. ఇప్పటికే సుమారు రూ.31 లక్షల వరకు బకాయి ఉన్నట్లు తెలిసింది. అధికారులు ఈ బకాయి వసూళ్లపై దృష్టిపెట్టాల్సి ఉంది. సంత మార్కెట్ సెంటర్‌లో 9 షాపులు ఉండగా 4 మాత్రమే లీజుకు ఇచ్చారు. కొత్తూరులో 11, బళ్లమార్కెట్ సెంటర్‌లో 8, తిలక్‌చౌక్‌లో 8, స్టేషన్ సెంటర్‌లో 30, మున్సిపల్ కార్యాలయం వద్ద 10, నూకాలమ్మ ఆలయం వద్ద 5 షాపులు ఉన్నాయి. మున్సిపల్ ఆర్‌ఐ తెలిపిన జాబితా ప్రకారం స్థానిక స్టేషన్ సెంటర్‌లోని 30 షాపులకు రూ.18,85,497, నూకాలమ్మ ఆలయం వద్ద ఉన్న షాపుల నుంచి రూ.1,64,538 బకాయి ఉన్నట్లు తెలిపారు. మొదటి అంతస్తులో ఉన్న లాడ్జికి సీల్ వేశామని అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న 10 షాపులకు సంబంధించి రూ.2,52,784, సంత మార్కెట్ వద్ద 4 షాపులకు సంబందించి రూ.61,576, బళ్లమార్కెట్ సెంటర్‌లోని షాపులకు రూ.2,07,027, తిలక్ చౌక్‌లోని షాపులకు రూ.4,18,544, కొత్తూరు మార్కెట్‌లో షాపుల నుంచి రూ.1,13,876 బకాయి ఉన్నట్లు ఆయన వివరించారు. ఆయా దుకాణాల యజమానులకు నోటీసులు ఇచ్చినా స్పందించక పోవడం గమనార్హం. కాగ తిలక్ చౌక్‌లో మున్సిపాలిటీ పరిధిలోని షాపులు శిధిలమైనా అద్దెల బకాయిలు మాత్రం చూపిస్తున్నారని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి నెలా వసూలు చేయాలి



విద్యుత్ బిల్లుల మాదిరిగా ప్రతి నెల మున్సిపల్ షాపుల అద్దెలపై శ్రద్ధ చూపితే బకాయిల బెడద ఉండదు. బకాయిలు చెల్లించకపోతే అపరాధ రుసం వసూలు చేసే అవకాశం ఉంది. దాంతో షాపుల యజమానులపై బారం పెరుగుతుంది. మున్సిపల్ రెవెన్యూ అధికారులు షాపుల యజమానులలో చైతన్యం తీసుకువాలి.

– కురుకూరి సోమేశ్వరరావు, మాజీ కౌన్సిలర్, సామర్లకోట

బకాయిలపై ప్రత్యేక శ్రద్ధ



మున్సిపల్ షాపుల నుంచి రావలసిన బకాయిలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాము. ఈ మేరకు రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. సచివాలయ సిబ్బందితో కలిసి మొండి బకాయిదారులకు నోటీసులు ఇచ్చాం. బకాయిలు చెల్లించిన షాపులకు మాత్రమే రెన్యువల్ చేయడం జరుగుతుంది.

– జె.రామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

ఉపాధి హామీ పనుల పరిశీలన


ఎఫ్‌కేపాలెంలో ఉపాధి హామీ పనులను తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ భావన

పిఠాపురం: గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులు పారదర్శకంగా నిర్వహించాలని అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ భావన అధికారులను ఆదేశించారు. పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె శుక్రవారం ఆమె పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పని ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక గ్రామ సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలని సూచించారు. ఆమె వెంట ఏపీడీ వసంత మాధవి, ఎంపీడీఓ చిన్నారావు నాయుడు తదితరులు ఉన్నారు.

ఆనందమీనందమాయె


చేపల విక్రయాలతో కళకళలాడుతున్న అమీనాబాదు తీరప్రాంతం

తీరంలో మొదలైన సందడి

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాదు తీరంలో చేపల కొనుగోళ్లు, విక్రయాల సందడి మొదలైంది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి సముద్రంలో వేట నిషేధం పూర్తి కావడంతో ముందుగానే మత్స్యకారులు వేటకు వెళ్లడం ప్రారంభించారు. శుక్రవారం ఒక్కరోజే మత్స్యకారులకు సుమారు రూ.20 లక్షలకుపైగా మత్స్య సంపద చిక్కింది. చేపల క్రయ విక్రయాలతో తీరప్రాతం కళకళలాడింది. మత్స్యకారులకు చిక్కిన చేపలు, రొయ్యలు, పీతలను కేరళ, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటకతో పాటు పలు రాష్ట్రాలకు వాహనాలపై తరలిస్తున్నారు. చేపల క్రయ విక్రయాలతో వ్యాపారులు బిజీ అయ్యారు.

రహదారిపైనే చేపల వ్యాపారం

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాదు, మూలపేట, కొనపాపపేట గ్రామాల్లో ప్రభుత్వం చేపల వ్యాపారులకు ప్రత్యేకంగా షెడ్లను నిర్మించింది. కాగా వ్యాపారులు వాటిని విడిచిపెట్టి ప్రైవేటు స్థలం, ప్రధాన రహదారులపై చేపల విక్రయాలు చేస్తున్నారు. దీంతో శుక్రవారం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఉప్పాడ– కొనపాపపేట బీచ్ రోడ్డులోని మూలపేట, అమీనాబాద్ సెంటర్ల చేపల వ్యాపారం జోరుగా సాగుతుంది. ముఖ్యంగా ఆదివారం ఉదయం, సాయంత్రం వేళల్లో మత్స్యకార మహిళలు రోడ్డుపైనే చేపలను విక్రయిస్తున్నారు. కొనుగోలు దారులతో రోడ్లు కిక్కిరిసిపోయి గంటల కొద్దీ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఇక్కడ రహదారిపై తరచూ ప్రమాదాలు అధికారులు, పోలీసులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై చేపల విక్రయాలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


అమీనాబాద్‌లో రోడ్డుపైనే చేపల విక్రయాలు

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి


చేబ్రోలులో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

గొల్లప్రోలు: బడిఈడు పిల్లలు తప్పనిసరిగా బడిలోనే ఉండాలని జిల్లా సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ కె.హరికృష్ణ అన్నారు. మండలంలోని చేబ్రోలులో శుక్రవారం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఇంకా పాఠశాలలో చేరని పిల్లలను బడి చేర్పించాలని, మధ్యలో బడి మానేసిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని, బాల కార్మికులు ఎవరు కూడా బయట ఉండకూడదని, పిల్లలు బడిలో, పెద్దలు పనిలో ఉండాలని నినాదాలు చేశారు. విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ హరికృష్ణ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం 6 నుంచి 14 సంత్సరాల లోపు విద్యార్థులకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య అందించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, డిజిటల్ లెర్నింగ్, విద్యార్థులకు మెరుగైన వసతులు, ఉచిత యూనిఫాం, అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందిస్తున్నారన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కె. శ్రీనువాసు, ఎంఈఓ శివప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీరు అందదు.. సాగు సాగదు


కొండెవరంలో పిచ్చిమొక్కలతో అడవిని తలపిస్తున్న పంట కాలువ

- పూడుకుపోయిన పంట కాలువలు
- శివారు పొలాలకు అందని నీరు
- మండలంలో 10154 ఎకరాల్లో సాగు

కొత్తపల్లి: నియోజకవర్గంలోని ప్రధాన పంట కాలువలు పూడిక, పిచ్చిమొక్కలు, గుర్రపుడెక్కతో పూడుకుపోయాయి. దీంతో శివారు పొలలకు నీరు అందని పరిస్థితి నెలకొంది. వాతావరణం చల్లబడటంతో రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నారు. వేసవి అధికారులు కాలువల్లో పూడిక తొలగించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలువలు ఇలా అధ్వానంగా ఉంటే శివారు ప్రాంతాల్లో సాగు చేసేదెలా అని వాపోతున్నారు. కొన్నిప్రాంతాల్లో అధికారులు పూడిక తీత పనులు చేపట్టినప్పటికీ తూతూమంత్రంగా పూడిక తొలగిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

మండలంలో సాగు ఇలా..

కొత్తపల్లి మండలంలో సుమారు 10154 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. కాగా పంట కాలువలు చెట్లు, పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారాయి. కొన్నిచోట్ల మట్టి పొరలు పేరుకుపోయాయి. సమస్యను ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. శివారు భూమలకు సాగునీరు వెళ్లాలంటే ప్రారంభంలో నీటి దుర్వినియోగాన్ని అరికట్టాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం తొలకరి పలకరిస్తే వరి నారుమళ్లు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.


కుతుకుడుమిల్లి కాలువలో పిచ్చి మొక్కలతో నిండిన పంట కాలువ


వాకతిప్పలో పూడుకుపోయిన కాలువ


కొత్తపల్లి-గోర్స రోడ్డులో తూము వద్ద పూడుకుపోయిన కాలువ

'భోజనం'లో నాణ్యత పెరగాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: మధ్యాహ్న భోజన పథకంలో మరింత నాణ్యత పెరగాలని మండల విద్యాశాఖాధికారి వై.శివ రామకృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మాధవపట్నం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఎలిమెంటరీ పాఠశాలలను ఆయన పరిశీలించారు. భోజనం రుచిగా తయారు చేస్తే ప్రతి విద్యార్థీ పాఠశాలలోనే భోజనం చేస్తారని తెలిపారు. ఈ మేరకు ఉపాధ్యాయులు భోజన కమిటీ సభ్యులు తయారు చేసిన వంటను రుచి చూడాలన్నారు. విద్యార్థుల చేరికలు పెరగాలని ఆయన సూచించారు. ఈ మేరకు బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మరుగుదొడ్లతో పాటు పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెరగాలన్నారు. విద్యార్థులు పాఠశాలకు రాక పోతే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చే విధంగా తల్లిదండ్రులతో అనుబంధం పెంచుకోవాలన్నారు. విద్యార్థులకు బోధనా పద్ధతులను ఆయన పరిశీలించారు.

ఉద్యానవనాల అభివృద్ధికి చర్యలు

కాకినాడ: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే ఉద్యాన వనాలను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. శుక్రవారం ఆయన కాకినాడ వివేకానంద పార్కును సందర్శించారు. అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. పార్కు ఆవరణలోని పచ్చదనాన్ని, వాకింగ్ ట్రాక్, క్రీడా పరికరాలను పరిశీలించారు. వివేకానంద పార్క్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కమిషనర్‌ను కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పిల్లల కోసం మరిన్ని క్రీడా పరికరాల ఏర్పాటు, ట్రాక్ అభివృద్ధి సహా సమస్యలను కమిషనర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే కాకినాడ వివేకానంద పార్కులో ఎన్నో సదుపాయాలు కల్పించామన్నారు. వాకర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు మరిన్ని అదనపు వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాకినాడ నగరంలోని ఇతర ఉద్యాన వనాలను కూడా మరింత అభివృద్ధి చేసి సౌకర్యవంతంగా, ఆహ్లాదాన్ని కలిగించేలా తీర్చిదిద్దుతామన్నారు. ఈ సందర్భంగా వివేకానంద పార్క్ పరిసరాల్లోని పింక్ టాయిలెట్లు, ఇతర ప్రాంతాల్లోని స్మార్ట్ పబ్లిక్ టాయిలెట్లను కూడా కమిషనర్ సందర్శించారు. వీటన్నింటినీ పూర్తిస్థాయిలో వినియోగంలో తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం డంపింగ్ యార్డ్‌ను కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, ఈఈ మాధవి, డీఈ సుబ్బారావు, ఏఈ వై.నాగేశ్వరరావు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏమరుపాటు ప్రాణం తీయొచ్చు!


ఇళ్లకు చేరి ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- వానాకాలంలో విద్యుత్ విషయంలో అవగాహన, జాగ్రత్త ఎంతో అవసరం
- ఆపత్కాలంలో అప్రమత్తతే ఆయుధం

కాకినాడ సిటీ: నైరుతి రుతు పవనాల రాకతో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. ఈ క్రమంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. పొలాల వద్ద రైతులు, ఇళ్లలో కుటుంబ సభ్యులు విద్యుత్ ప్రమాదాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. వర్షాలు కురుస్తున్నప్పుడు గోడలు, నేల, విద్యుత్ స్తంభాలు అంతా తేమతో నిండి ఉంటాయి. ఈ తేమతో విద్యుత్ ప్రమాదాలు జరుగుతాయి. విద్యుత్ లైన్‌కు ఆనుకుని ఉన్న స్తంభాల నుంచి నేలకు, గోడలకు ఇతర వస్తువులకు విద్యుత్ ప్రవాహం జరిగే విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో వినియోగారులు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వర్షాలు కురుస్తున్నప్పుడు, కురిసిన తర్వాత తడిసిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్టేవైరు, సపోర్టు వైరును తడిసిన విద్యుత్ ఉపకరణాలను తాకరాదు. వాటికి దూరంగా నడవాలి.
- దండెం వైర్లు, విద్యుత్ వైర్లను కలపొద్దు. సపోర్ట్ వైర్లుగా ఇన్సులేటెడ్ వైర్లను ఉపయోగించాలి.
- ఓల్టేజీలో హెచ్చు తగ్గులు ఉన్నా, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తున్నా వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయాలి.
- వర్షాల వల్ల చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లకు తాగి షాక్ ఇచ్చే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. వాటిని తాకకుండా విద్యుత్‌శాఖ సిబ్బందికి తెలియజేయాలి.
- వ్యవసాయ నిమిత్తం, గృహాల్లో అతుకులు లేని సర్వీసు వైరును మాత్రమే ఉపయోగించండి.
- తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తాకొద్దు. వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి.
- ఎవరికైనా పొరపాటున విద్యుత్ షాక్ తగిలితే దగ్గరలోని వ్యక్తులు షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించాలన్న ఆతృతతో అతన్ని నేరుగా ముట్టుకోవద్దు. కర్ర, ప్లాస్టిక్ లాంటి వస్తువులతో అతని నుంచి వైరును వేరు చేయాలి.
- ముఖ్యంగా రైతులు వ్యవసాయ అవసరాల నిమిత్తం పంపుసెట్లను వాడుతున్నప్పుడు కరెంటు మోటార్లకు కాని, పైపులను కాని, ఫుట్‌వాల్వ్‌లను కానీ ఏమరపాటుతో తాకొద్దు. వ్యవసాయ పంపు సెట్లు, స్టార్టర్లను విధిగా ఎర్త్ చేయాలి. విద్యుత ప్రమాదాలు ఎర్త్ చేయని పక్షంలో పరికరాల వల్లే ప్రమాదాలు జరుగుతాయి.
- డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద అనధికారంగా ఫ్యూజులు మార్చడం, రిపేరు చేయడం, ఏజీ స్విచ్‌లు ఆపరేట్ చేయడం, కాలిన తీగలను సరిచేయడం ప్రమాదకం.
- మోటారు, పంపు సెట్లకు ఏదైనా సాంకేతిక లోపం తలెత్తితే సొంతంగా సరిచేద్దామని ప్రయత్నిస్తే ప్రాణనష్టం, హాని జరగవచ్చు. మోటారు మరమ్మతు చేయడం తెలిసిన వారిచేతనే వాటిని బాగు చేయించండి.
- గ్రామీణ వినియోగదారులు తమ పరిధిలోని క్షేత్రస్థాయి విద్యుత్ సిబ్బందికి లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇంజినీర్, సెక్షన్ ఆఫీసర్‌లను సంప్రదించి వారి సేవలను పొందాలి.

వర్షాకాలం జాగ్రత్తగా ఉండాలి



వర్షాకాలంలో విద్యుత్ పరికరాల మరింత అప్రమత్తంగా ఉండాలి. ఏ మాత్రం ఏమరు పాటు వహించిన ప్రమాదానికి గురవుతారు. తగిన జాగ్రత్తలు పాటించడమే దీనికి నివారణ. విద్యుత్ సంబంధిత సమస్యలకు ఫిర్యాదులు నేరుగా విద్యుత్ శాఖ కార్యాలయంలో గాని సమీపంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్లలో కాని తెలపాలి.

– ప్రసాద్, డివిజనల్ విద్యుత్‌శాఖ అధికారి, కాకినాడ.